
# ముక్తి

ఎస్. ఎస్. ఆర్. మూర్తి

మనసు నిలిచిన చోట భగవంతుడు కనిపిస్తాడు. మనసు నిలిపినవానికి దర్శన మిస్తాడు. అయితే మనిషి కోరింది భగవంతుడు ఇస్తాడా. మనిషికి యోగ్య మైనదే భగవంతుడు ప్రసాదిస్తాడా అని ప్రశ్నించుకుంటే — అవివేకం మనిషిలో దేవుని కోసం వేదన కలిగిస్తే, వివేకం ఆ వేదన కలిగిస్తుందని సమాధానం చెప్పుకోవాలి.




కిష్టుడు నోరు తెరుచుకుని వింటున్నాడు.

వాడి కళ్లకి పంతులమ్మ కదులుతున్న పెదవులు తప్ప ఏమీ కనపడటం లేదు. వాడి మనస్సు ఆ కథలో లయమై పోతున్నది.

పంతులమ్మ చెప్పుకుపోతున్నది.

“. . . అప్పుడు ఆ బీదబ్బాయికి పాపం, ఏమి చేయటానికి తోచలేదు. ఏం చేస్తాడు? ఇంట్లో పరిస్థితి తెలుసు. దిగులుగా ఇంటికి తిరిగి వచ్చాడు.”

కిష్టుడి మనస్సు ద్రవించిపోయింది. పాపం! ఎలా ఆ బీదబ్బాయికి? రేపు పంతులుగారింట్లో జరిగే శుభకార్యానికి పిల్లలందరినీ తలా ఒక ముంతతో పెరుగు, పాలు తెమ్మన్నారు. కాని ఆ అబ్బాయికి ఎవరిస్తారు? ఆ అబ్బాయి తన దగ్గరికే వస్తే తప్పకుండా ఇస్తాడు.

“. . . పలకా, బలపం ఓ మూల పడేశాడు.

ఆ అబ్బాయికి ఓ పక్క భయం. ఎందుకంటే రేపు తను ఏమీ తీసుకు వెళ్ళలేడు. పంతులుగారు ఊరుకోడు. చండశాసనుడు. చింతబరికె తీసుకుని బాదుతాడు. ఆ అబ్బాయి భయంతో బిగుసుకుపోయాడు. ముఖంలో నెత్తురుచుక్క అన్న మాట లేదు. ఆ అబ్బాయి మనస్సులో ఈ విషయం మాటిమాటికి తలపుకు వస్తున్నది. కళ్ళు చెమరుస్తున్నాయి. గుండె దడదడ కొట్టుకుంటున్నది.''

కిష్టుడి పరిస్థితి అలానే అయింది.

ఇంతలో వాళ్ళమ్మ వచ్చింది. ఆ అబ్బాయిని ప్రేమగా దగ్గిరకి తీసుకుంది. ''ఎందుకు, నాన్నా, ఏడుస్తున్నావు? పంతులుగారు కొట్టారా? పాఠాలు చదవకపోతే కొట్టరూ?'' అన్నది.

ఆ అబ్బాయి కళ్ళనీళ్ళతో తల్లివంక చూశాడు. చాలాసేపు తల్లి ఓదార్చిన తరవాత అసలు సంగతి చెప్పాడు.

''అమ్మా, అమ్మా, మరేమో రేపు మా పంతులు గారింట్లో ఏదో వ్రతమట! అందరిని పాలు, పెరుగు తెమ్మన్నారు. తీసుకుపోకపోతే కొడతారమ్మా. మరి మనింట్లో పాలు, పెరుగు ఏవి? నా కెవరిస్తారు? ఎక్కడికన్నా పోయి తీసుకురా, అమ్మా!'' మారాం మొదలుపెట్టాడు.

పాపం, తల్లి మాత్రం ఏం చేస్తుంది? ఎక్కడికని పోతుంది? వెళ్ళినా ఎవరిస్తారు?

'అయితే ఎవరు ఇవ్వలేదా? ఆ అబ్బాయి దెబ్బలు తిన్నాడా? అమ్మో!' కిష్టుడి గుండె జలదరించింది. ఆ దెబ్బలన్నీ తనకి తగిలినట్లే అనిపించింది. వాడికి దుఃఖం వచ్చింది. ఒక విచిత్రమైన అనుభూతితో వాడి హృదయం పొంగింది.

''...అప్పుడు తల్లి ఏం చేసిందో తెలుసా? కొడుకుని జాలిగా ఒడిలోకి తీసుకుని, 'నాయనా, మన కెవరు లేరు. మనం బీదవాళ్ళం. పెరుగు, పాలు మన కెవరిస్తారు?' అన్నది.''

''ఎట్లాగమ్మా'' అన్నాడు ఆ అబ్బాయి.

''వెళ్ళి దేవుణ్ణి అడుగు'' అంది నిమ్మళ్ళా తల్లి. ప్రతి రోజు ఆ అబ్బాయి పంతులుగారింటికి పోవాలంటే చాలాదూరం నడవాలి. మధ్యలో ఆ అబ్బాయికి భయం వేసేది. అప్పుడు దేవుణ్ణి తలుచుకునేవాడు. ఇప్పుడు తల్లి ఈ మాట అనగానే ఆ అబ్బాయి ముఖంలో ఆశ వెలిగింది. ఏడుపు నాపుకుని గబగబా దేవుడి గుడికి వెళ్ళాడు.

''మాలాంటి వాళ్ళకి నువ్వే దిక్కుట. మా కెవ్వరు లేరు. మా పంతులుగారింట్లోకి రేపు పాలు, పెరుగు తీసుకుపోవాలి. అవి రెండు ఇయ్యి. లేకపోతే మా పంతులుగారు కొడతారు. ఓ దేవుడా, నువ్వు దయగలవాడివని అందరు అంటారు. నా మీద నీకు దయ లేదా?''


ఆ అబ్బాయి కళ్ళు మూసుకున్నాడు. విపరీతమైన భక్తితో అతని హృదయం తాదాత్మ్యం చెందింది.

''నువ్వు చిన్నప్పుడు ఎన్నో పాలు తాగావు. పెరుగు తిన్నావు. వెన్న మెక్కావు. నీ వింత కఠినంగా ఊరుకుంటే ఎట్లా? నాకు నువ్వే దిక్కు.''

ఆ అబ్బాయి కింకో ఆలోచన వచ్చింది. రోజూ పంతులుగారింట్లో ప్రార్థన చేసేవాడు. ఇప్పుడు అది గుర్తు వచ్చింది.

''ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు
లీనమై
ఎవ్వని యందుడిందు పరమేశ్వరు డెవ్వడు మూల
కారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానెయైనవా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు
వేడెదన్.''

అప్పు డేమైందనుకున్నారు? ఆ అబ్బాయి అమాయకంగా అడుగుతూంటే పాపం, దేవుడికి జాలి వేసింది. భారమంతా తనమీద పెట్టాడాయె! ఇంకెట్లా? అంతకుముందే ఎవరో పాలు, పెరుగు తెచ్చి నివేదన చేసి వెళ్ళారు. ఆ అబ్బాయి ఆర్ద్రములైన కళ్ళు తెరిచాడు. దేవుడు నవ్వుతున్నాడు. ఆయన పాదాల దగ్గిర రెండు ముంతలలో పాలు, పెరుగు ఉన్నాయి.''




ఇక ఆ తరవాత మాటలు వినబడలేదు కిష్టుడికి. వాడు ఇందాకటినించి గుండెలు చిక్కబట్టుకుని విన్నాడు. వాడి దుఃఖమంతా అకస్మాత్తుగా ఆనందంగానే మారింది. ఎంత సంతోషం! ఆ పాలు పెరుగు తనకే లభించాయన్నంత తృప్తి! నిజంగా దేవుడిలో అంత దయ ఉందా? నిజంగా? నిజంగా? ఉంటే మరి!

వాడి లేతహృదయంలో ఏదో ఒక మూలగా విషాదభావం కదిలింది. దేవుడు మంచివాడు. దయ గలవాడు. అందర్నీ ప్రేమించేశక్తి గలవాడు. అందర్నీ ఓదార్చేవాడు. అందరికన్నా గొప్పవాడు. తన కెందు కిలా వెలితి చేశాడు?

వాడికి గంట కొట్టిందికూడా వినబడలేదు. పిల్లలందరు అరుచుకొంటూ వెళ్ళిపోయిందికూడా తెలియదు. వాడి కళ్ళకి ఎదురుగా ఇంకా పంతులమ్మ ఏదో చెబుతున్నది. వాడి హృదయంలో వెచ్చని తరంగం పొంగుతున్నది. ఒక గొప్ప సత్యం స్థిరంగా వాడి మనస్సులో కాపురం ఏర్పరుచుకుంటున్నది.

పిల్లలందరు వెళ్ళిపోయాక పంతులమ్మ కూడా లేచింది. ఆవిడికి కిష్టు డింకా కూర్చుని ఉండటం కనిపించింది. వాడి ముఖం ఒక వింత కాంతితో వెలుగుతున్నది. కన్నీళ్ళు, ఆనందబాష్పాలు బుగ్గల మీదుగా జారినాయి. వాణ్ణి చూడగానే ఆవిడికి ముద్దు వచ్చింది. వాణ్ణి సమీపించింది.

''ఎందుకురా అలా ఉన్నావు?'' అంది.

కిష్టుడు ఈ లోకంలోకి వచ్చాడు. వాడి కళ్ళకి ముందున్న రంగుల కల అదృశ్యమైంది. పంతులమ్మ నవ్వుతూ వాడి పక్కన కూర్చుంది. వాడికి సిగ్గు వేసింది. వాడి కెంతో చెప్పుకోవాలనుంది. కాని ఏదో అడ్డు వస్తున్నది. చాలాసేపటికి పంతులమ్మ, తను తప్ప ఎవరూ లేరని గ్రహించి అడిగాడు: ''పంతులమ్మ గారూ, మీరు చెప్పినదంతా నిజమా?''

''ఏమిట్రా?'' అంది.

''అదే, దేవుడు నిజంగా ఏ మడిగినా ఇస్తాడా?''

పంతులమ్మ ముఖంలో నవ్వు మాయమైంది. భారంగా కళ్ళు మూసుకుంది.

''చెప్పండి. దేవుడికంత ప్రేమ ఉందా మనమంటే?''

''అవును, బాబూ,''

''నిజంగా ఇస్తాడా?''

''మనం భక్తితో ప్రార్థిస్తే దేవుడి హృదయం ఇట్టే కరిగిపోతుంది. మనమేం అడిగినా ఇస్తాడు.''

ఇక వాడు కూర్చోలేదు.

''పోతున్నావా?''

''అవునండి. ఇంటికి పోతాను. బడి వదిలి చాలా సేపైంది.''

ఎందుకో తెలియదు గాని వాడి మీద ఆపేక్ష కలిగింది పంతులమ్మకి. వాడెందుకిలా అయిపోయినాడు? ఆ కథలో అంత ఆనందాన్ని కలిగించేదేముంది?

''పద, పోదాం.'' పంతులమ్మకూడా లేచింది. కాని వాడు పరిగెత్తుకుపోవాలని చూస్తున్నాడు.

''ఎందుకురా అంత తొందర?'' అంది.

వాడు దీనంగా చూశాడు.

''ఆలస్యమైతే మా పిన్ని కోప్పడుతుందండి.'' పరుగు తీశాడు.

* * *

వాడు ఊహించినదంతా జరిగింది.

''ఏం నాయనా, ఏ రాచకార్యాలు వెలగబెడుతున్నా వింతసేపు? బడి వదిలి ఎంతసేపైంది? ఇంతసేపు ఎక్కడ తిరుగుతున్నావు? ఏమేడుస్తున్నావు?'' వాకిట్లో పిన్ని ప్రత్యక్షమైంది.

వాడి గుండె ఆగిపోయింది.

భయంగా ఆవిడ కళ్ళలోకి చూశాడు.

''మాట్లాడవేం?'' సింహగర్జన వినిపించింది.

వాడు వణికిపోయాడు.

''ఎప్పుడు పాలు తెస్తావు? ఎప్పుడు కాఫీ తాగుతాము? నువ్వేమో ఇట్లా చేస్తావు? కోప్పడితే సవితితల్లి అని నవ్వుంటారు. ఇంతకు ఎక్కడున్నావు? ఏం చేశావు?''

''. . .''

''మాట్లాడవేం రాయిలా. లోపలికి రా.'' చెయ్యి పట్టుకుని గుంజింది. ఆ స్పర్శ అగ్నిలా కాల్చింది. వాడి కేడుపు వచ్చింది.

"బళ్ళోనే, ఉన్నాను పిన్నీ." ఏడుస్తూ అన్నాడు. వాడి కళ్ళు జలపాతాలైనాయి. ఆ కన్నీళ్ళు 'ఓ దేవుడా, నన్ను రక్షించు' అంటున్నాయి.

"బళ్ళో ఇంతసేపేం చేస్తున్నావు?"

"పంతులమ్మ కథ చెప్పింది."

"అందుకని ఆలస్యమైందా? మరి వాళ్ళ రమణ వచ్చిచాలా సేపైందే? అబద్ధాలుకూడానేర్చుకున్నావా?"

వాడు చెంప తడుముకున్నాడు. వాడి కన్నీరు కళ్ళలో ఇంకిపోయింది. వాడి మనస్సు కొయ్యబారిపోయింది. రోజూ ఇలాంటి శిక్షలు ఎన్నో? వాడు వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చున్నాడు.

"ఆట్లా ఊరు, వాడు వినపడేటట్లు ఏడుస్తావెందుకు? ఇప్పుడు నే నేమన్నానని. పో. వెళ్ళి పాలు తీసుకురా. తింటానికి, తాగటానికి మాత్రం లోపం లేదు."

వాడి హృదయంలో మానాభిమానాలకి చోటు లేదు. అయినా వాడికి తెలియకుండానే ఈ మాటలు వాడి లేతహృదయాన్ని రంపంలా కోసినాయి. ఆ హృదయం కన్నీరు కార్చింది. వాడు జాలిగా ఆవిడ వంక చూశాడు.

"వెళ్ళు."

చొక్కాతో కన్నీరు తుడుచుకుని గిన్నె తీసుకుని బయలుదేరాడు. దారి పొడుగునా ఒకటే ఆలోచన.

పిన్ని అస లెందుకు వచ్చింది? ఎక్కణ్ణించి వచ్చింది?

చాలా రోజుల క్రితం ఒక రోజున. . .

తను నిద్ర లేచేసరికి ఇల్లంతా గోలగా ఉంది. కళ్ళు నులుముకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు. ఇంటినిండా బంధువులు. వీళ్ళందరు ఎప్పుడు వచ్చారు?

అంతలో అమ్మమ్మ తనని దగ్గరగా తీసుకుని బావురుమంది. ఆవిడ ఏడుస్తూంటే ఎలాగో ఉంది. ఆవిణ్ణి తప్పించుకుని వాకిట్లోకి వచ్చాడు.

వాకిట్లో అరుగుమీద తండ్రి విచారంగా కూర్చుని ఉన్నాడు. వాణ్ణి చూసి దగ్గిరికి తీసుకుని కన్నీరు కార్చాడు.

"ఎందుకు, నాన్నా, ఏడుస్తున్నావు?" అన్నాడు.

"అంతే, బాబూ, ఏడవక ఏం చేయను? ఏడుపే మిగిలింది."

ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏమిటి, బాబాయి, నువ్వుకూడా. ధైర్యంగా ఉండాలికాని. . ." ఎవరో ఓదార్చారు.

"నాన్నా, అమ్మేది?"

చుట్టూ వాళ్ళు జాలిగా చూశారు.

"ఉంది, బాబూ, నువ్వెళ్ళు."

కాని ఆ తరవాత చూశాడు. తల్లిని గోడకానించి కూర్చోబెట్టి నీళ్ళు పోశారు. కర్రలమీద పడుకోబెట్టి ఎక్కడికో తీసుకుపోయారు. ఆ రాత్రి ఆకాశంలో చందమామని చూపిస్తూ తల్లి కథలు చెప్పలేదు. అసలు ఇంట్లో కనపడలేదు. వాడి సందేహం శేషంగానే ఉండిపోయింది.

"నాన్నా, అమ్మేది!" మళ్ళీ అడిగాడు.

తండ్రి జవాబుగా ఉత్తరీయం అడ్డు పెట్టుకుని ఏడ్చాడు.

"చెప్పు, నాన్నా."

ఎవరో వచ్చి వాణ్ణి అక్కణ్ణించి తీశారు.

"తప్పు, బాబూ. రా. పడుకుందాం."

"నాకు అమ్మ కావాలి!" బిక్కమొహంతో అన్నాడు.

"ఉంది, బాబూ, వస్తుంది."

"ఎక్కడికి వెళ్ళింది?"

"దేవుడి దగ్గిరికి వెళ్ళింది?"

"ఎందుకు?"

"దేవుడు రమ్మని పిలిచాడు."

"నన్ను పిలుస్తాడా?"

ఆవిడ అరచేయి నోటి కడ్డం పెట్టింది.

"ఛ, అలా అనకూడదు."

"నాకు అమ్మ కావాలి."

"వస్తుందిగా."

తరవాత తరవాత బంధువులందరు వెళ్ళిపోయాక, ఇంట్లో తల్లి కనపడకపోయినా, అదొక వెలితితో బాధపడినా, ఎవర్నీ అడగలేక ఆ ప్రశ్నని గుండెలోనే ఇముడ్చుకొన్నాడు. కాని ఏదో ఆశ. అడగలేక అడగలేక తండ్రిని అడిగేవాడు. ఒక్కొక్కసారి తండ్రి ఏడుస్తూ చెప్పేవాడు. ఒక్కోసారి కసురుకునేవాడు. క్రమంగా వాడికి, తండ్రికి దూరం ఎక్కువైపోతూ వచ్చింది.

ఆ స్థితిలో ఒక రోజు "కిష్టుడూ, ఇదిగో అమ్మ" అని ఈవిణ్ణి తీసుకువచ్చాడు.

దేవుడి దగ్గిరికి వెళితే మనుష్యులు మారిపోతారా? ఈవిడ అమ్మ ఎందుకైంది? అమ్మ ముఖంలో ఎంత ప్రసన్నత? ఈవి డెవరు? ఎక్కణ్ణించి వచ్చింది?

వాడి మనస్సు ఆవిణ్ణి తల్లిగా స్వీకరించటాని కంగీకరించలేకపోయింది. ఆ పవిత్రమైన స్థానంలో ఈవిడకు స్థానం లేదు.

"నాకు మా అమ్మ కావాలి. ఈవి డెవరో? అమ్మ కాదు."

తండ్రి విట్టూర్చాడు.

మొదటిసారి ఆవిడ హృదయంలో ద్వేషానికి అంకురార్పణ జరిగింది.

"ఈవిడ అమ్మే, బాబూ."

"అమ్మ ఇలా ఉండదు. ఇలా—" ఆ "ఇలా" కు అర్థం వాడి హృదయానికే తెలుసు.

"అమ్మ అంటుంటే?" తండ్రి ముఖంలో కోపం చూసి బెదిరిపోయాడు. అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

"ఇప్పటికయినా అసలు అమ్మని తెస్తాడా నాన్న? లేకపోతే ఎప్పుడు ఈ చెడ్డ ఆవిడే ఇక్కడ ఉంటుందా?"

బళ్ళో అందరు పిల్లలకి అమ్మ ఉంది. తనకే లేదు. అందరు "అమ్మా" అని పిలుస్తారు. తనే పిలవలేడు.

ఆ అమ్మ వస్తే ఎంత బాగుంటుంది? ఎంత ప్రేమగా చూస్తుంది? తనంటే ఎంత అపేక్ష అమ్మకి? రోజూ లేవగానే అమ్మ నవ్వుతూ కనిపించేది. ఎప్పుడైనా ఇలా కొట్టిందా? కోపంగా మాట్లాడిందా? రోజూ రాత్రిపూట ఎన్ని మంచికథలు చెప్పేది. ఏది ఆ అమ్మ? అమ్మకి తనమీద ప్రేమ లేదా? ఉంటే మరి రాదేం? అసలు నాన్నే మంచివాడు కాదు. ఆ రోజు కర్రలకేసి తాళ్ళతో కట్టి అమ్మని తీసుకు వెళ్ళాడు. ఎక్కడ దాచాడో? లేకపోతే అక్కణ్ణించి రావటానికి అమ్మకి దారి తెలీదేమో!?

వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాడి మనస్సులో తల్లిమీద ప్రేమ పొంగి పొరలింది. నాన్న తీసుకు రాడు. అమ్మ రాలేదు. అయినా దేవుడికేం పని అమ్మతో?

"నేనే వెళ్ళి అడుగుతాను దేవుణ్ణి. ఆ బీదబ్రాహ్మడికి పాలు, పెరుగు ఇచ్చాడే. నా అమ్మని నా కియ్యడూ?"

ఇదిగో కొత్త ఆలోచన. దీనిలో కొండంత ఆశ ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది. ఆశతోనే వాడికి సగం బలం వచ్చింది. వాడి మనస్సుకి ధైర్యం వచ్చింది. అమ్మ వస్తుంది. దేవుడిస్తాడు.

ఆలోచనలతో ఎంత కాలం గడిచిందో? ఇంటికి చేరేసరికి దీపాలు పెట్టారు.

"ఎక్కడికి పోతే అక్కడ. ఏమిటి, నాయనా, అంత ఆలోచనలు? ఎవరి కొంప తీద్దామని?"

కిష్టుడు వినిపించుకోలేదు. వాడి కళ్ళలో మామూలుగా ఉండే భీతి ఇప్పుడు లేదు.

పాలగిన్నె పెట్టి పెట్టెలోంచి మురళి తీసుకొని వాయించుకుంటూ కూర్చున్నాడు.

"ఏమిటా నిర్లక్ష్యం? నీకు పుట్టిన బుద్ధేనా? ఎవరైనా హితబోధ చేస్తున్నారా?"

వాడి మనస్సు ఈ లోకంలో లేదు. ఆ మురళిరవం లోంచి ఒక దయనీయమైన ప్రార్థన.

"వినవే. వినబడటం లేదా? చెవుడా?"

"అమ్మా, రావా" అంటున్నది మురళీరావం.

ముచ్చటపడి కొత్తగా కొన్న నిలువుటద్దాన్ని ఎవరో పగలగొట్టారు. ఆ గృహిణి మండి పడింది. పిల్లలందర్ని పిలిచి, "ఎవరు ఈ పాడుపని చేశారో చెప్పండి" అని గద్దించింది.


మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు పిల్లలు.

"ఉండండి. మీ నాన్న వచ్చారంటే మీ పని అవుతుంది" అని ఆమె బెదిరించింది.

ఆఖరివాడు "నేనే బద్దలు కొట్టానమ్మా. నాన్న చూశారు" అన్నాడు.

"మరి ఏమన్నారు?" అని అడిగింది ఆమె.

"ఉండు. మీ అమ్మ చూసిందంటే నీ పని అవుతుంది— అన్నారు నాన్న" అన్నాడు వాడు.



"ఆ గొళ్ళెం అవతల పారేస్తాను."

"దేవుడా, నీకు మురళి అంటే ఇష్టం. పాలు, వెన్న అంటే ఇష్టం. నీ కెంత కావాలంటే అంత ఇస్తాను. మా అమ్మ నిచ్చేయి" అంటున్నది మురళీరవం.

"ఇద్దుందా లేదా? చెబితే వినబడటం లేదా?"

ఈ లోకంలోకి వచ్చాడు.

"ఏమిటి, చిన్నీ?"

"ఏమిటా? ఇప్పుడా పాలు తేవటం?"

"ఆలస్యమైంది."

"అదే అడగటం."

వాడు సమాధానం చెప్పలేదు.

"అది, బాగా నేర్చుకున్నారు, ఏమన్నా అంటే నోరు మూసుకుని కూర్చుంటే సరి, అరిచి అరిచి నోరు నొప్పెట్టి చస్తుంది గదా అని. అలా ఉండబట్టే నీ బతు కిలా ఉంది. రానీ మీ నాన్నతో చెప్పి ఏమిటో తేలుస్తాను."

'ఏమిటి తేల్చేది. ఈ రాత్రి మా అమ్మ వస్తుంది. నీ పని అయిపోయింది' అన్నట్టుగా ఉంది వాడి చూపు. ఆ చూపులో ఒక విధమైన హేళన మిళితమై ఉంది.

• • •

రాత్రి!

పసివాడి హృదయంలా ఆకాశంలో బాలచంద్రుడు ఉదయించాడు. వాడి ఆశలా పది బారలు పైకి వచ్చాడు.

వాడికి మాత్రం నిద్ర రాలేదు. ఈ రోజు పండుగలా ఉంది. ఇంకా కొద్ది సేపటిలో అమ్మ వస్తుంది. వచ్చి...

ఎత్తుకుంటుంది.

ముద్దు పెట్టుకుంటుంది.

నవ్వుతుంది, నవ్విస్తుంది.

అమ్మ ఒడిలో పడుకుని ఆవిడ పెట్టిన బాధలన్నీ చెబుతాడు. అప్పుడుంటుంది ఆవిడ పని. ఇంక ఏం భయం, అమ్మ వస్తుంది గదా?

కిష్టుడు చుట్టూ చూశాడు. అందర్నీ మాయలా నిద్ర ఆవరించింది. మెల్లగా లేచి మురళిని చేతిలో పట్టుకుని బయటకు వచ్చాడు. వాడి గుండెల్లో భయం ఆవేశించింది. ఎవ్వరూ లేరు. నిర్మానుష్యంగా ఉంది.

"ఆ అబ్బాయికి భయంవేస్తే దేవుణ్ణి తలుచుకునే వాడు."

పంతులమ్మ మాటలు గుర్తు వచ్చినాయి.

"కృష్ణా, కృష్ణా!" వాడి మనస్సు దీనంగా అరిచింది.

ఒక్కసారి దేవుణ్ణి తలుచుకొని గుడివైపుగా పరుగు తీశాడు.

"వచ్చేశాను. కృష్ణా, వచ్చేశాను. మా అమ్మని ఇమ్మని అడగటానికి వచ్చాను."

కృష్ణుడు గలగలా నవ్వినట్టు చెట్ల ఆకులు కదిలినాయి. వాడు బావిలో నీళ్ళు తోడుకుని కాళ్ళు కడుక్కుని గుళ్ళోకి వెళ్ళాడు.

ఆ కృష్ణుడు...కమ్మ్తూరీతిలకాన్ని నుదుట పెట్టుకున్నాడు. వక్షఃస్థలంలో కౌస్తుభం మెరుస్తున్నది. నాసాగ్రా నవమౌక్తికం వెలుగులు వెదజల్లుతున్నది. ఆయన చేతిలో వేణువు ఉంది. ఆయన చేతులకి బంగారపు కంకణాలున్నాయి. దేహమంతా గంధం పూసుకున్నాడు. ఆ పరిమళం చుట్టూ వ్యాపిస్తున్నది. ఆయన గోపికలచేత పరివేష్టింపబడి నిల్చున్నాడు. ఆయన సన్నిధానముందు రెండు దీపారాధన లున్నాయి.

ఆయన ముఖంలో వాత్సల్యం. ఆయన కిష్టణ్ణి చూసి నవ్వాడు. ఆ నవ్వు వాడి లేతగుండెలో కితకితలు పెట్టింది. వాడు భక్తితో ఆయన ముందు నమస్కరించాడు.

అంతలో వాణ్ణి విషాదభావం ఆవరించింది. "కృష్ణా, కృ—ష్ణా, నాకు మా అమ్మ నిచ్చేయి. ఇన్నాళ్ళ మా అమ్మ నీ ఇంట్లో నీ దగ్గిరుంది. నేను మా అమ్మని వదిలిపెట్టి ఉండలేను. నాకు అమ్మ కావాలి. మా అమ్మ నీ లాగా తీయగా నవ్వుతుంది. ప్రేమగా పలకరిస్తుంది. నాకు భయం వేస్తే మా అమ్మ ఒడిలో తల దాచుకుంటాను. నాకు కోపం వస్తే మా అమ్మని కొడతాను. గోల చేస్తాను. అయినా మా అమ్మని నా కిచ్చేయి."




కృష్ణుడు వింటున్నాడు.

వాడి కళ్ళలో నీరు తిరిగింది. వాడి గొంతు గద్గదికమైంది.

"మా నాన్న ఆవిడెవర్నో తీసుకున్నాడు. ఆవిడ మంచిదికాదు. ఆవిడకి నా మీద ప్రేమ లేదు. నా మీద కోపం ఆవిడకు. నన్నెప్పుడు ప్రేమగా దగ్గిరికి తీసుకోలేదు. నా మీద నాన్నతో లేనిపోనివన్నీ చెబుతుంది. నాన్న అవన్నీ విని నన్ను కొప్పడుతాడు. మా అమ్మ నాన్నతో నవ్వుతూ నేను అల్లరిచేశానని చెబితే నాన్న నవ్వేవాడు. నాకు అసలు మా అమ్మ కావాలి. నీకు కావాలంటే ఈవిణ్ణి తీసుకుపో. ఈవిడలో ఎంత కల్మషం ఉందో తెలుసా? నువ్వు వాళ్ళందరిని బాగుచేస్తావుగా! కృష్ణా, కృష్ణా, పలకవేం?"

కృష్ణుడు పలకలేదు. జాలిగా వాణ్ణి చూశాడు.

'మీ అమ్మని పంపించటం నా చేతిలో లేదు, బాబూ, వెళ్ళిపో' అంటున్నాయేమో ఆ చూపులు. లేకపోతే 'నా చిన్నప్పుడు నేనుకూడా మా అసలు అమ్మ దగ్గిర నుంచి పారిపోయి ఇంకో అమ్మ దగ్గిరున్నాను. నాకు నేనే అనమర్హుణ్ణి' అంటున్నాయేమో?

వాడిలో నిరాశ కలిగింది. అయినా ఇంకా ఆశ చావలేదు.

"నీవు సర్వాంతర్యామివిగా. నీకు తెలుసుగా. ఆవిడ నన్నెట్లా కష్టాలు పెడుతుందో చూస్తున్నావుగా? ఇంకా జాలిలేదా? నీలో దయ ఉందంటారే. దిక్కులేని వారికి నువ్వే దిక్కంటారే. నువ్వు ఒకసారి తలవగానే ఆ మొసలిని చంపి ఏనుగుని రక్షించావటగా! చెప్పు, కృష్ణా, మా అమ్మ లేకపోతే నా కేం తోచటం లేదు. నాకు మా అమ్మ కావాలి. అమ్మనిచ్చేయి. మా అమ్మని, నన్ను వేరు చేస్తే నీకు పాపం చుట్టుకోదూ? ఆ బీదబ్బాయి అడగ్గానే అన్నీ ఇచ్చినంతేనే? వాళ్ళందరు నీకు ఇష్టమయిన వాళ్ళా? నేను కానా? నీ కోసరం ఇంత రాత్రిపూట చీకట్లో పరిగెత్తి వచ్చాను. కృష్ణా, నీకు కోటి నమస్కారాలు. మా అమ్మ నివ్వు."

వాడికి ఏడుపే వచ్చింది. వాడికి తెలియకుండానే వాడి మనస్సు ఆ కృష్ణుడిలో నిమగ్నమైంది.

"నేను రోజూ లేవగానే నీకు దణ్ణం పెడతాను. పడుకోబోయేముందు దణ్ణం పెడతాను. నీ మీద నా కెంత ప్రేమో తెలుసా? అసలు నువ్వు తప్ప నా కెవరు కనపడటం లేదు."

ఇది అజ్ఞానమా?

కాదు.

ఇందులో నివేదన, ఆత్మనివేదన, వాడి మనస్సు, ఆత్మ, హృదయం ఒక భక్తిభావంతో లయమైనాయి. వాడి కళ్ళకి ఆయన విందువిగ్రహం తప్ప ఏమీ కనపడటం లేదు. ఇదొక సాధన. ఒక విచిత్రమైన అనుభూతితో వాడి దేహం పులకించింది.

"కృష్ణా, పలకవా నాతో? నేనేం తప్పు చేశాను? చేస్తే నన్ను కొట్టు. అంతేగాని మా అమ్మని మాత్రం నీ దగ్గిర ఉంచుకోకు." వాడికి ఏడుపు ఆగటం లేదు.

"ఇంక అసలు నాతో మాట్లాడవా? మా అమ్మ నివ్వవా?"

బావురుమన్నాడు.

వాణ్ణి ఎవరు ఓదార్చలేదు. చాలాసేపటికి ఆ కన్నీరు బయటకు పోయాక వాడి పరిమితమైన బుద్ధిలో కొత్త ఆలోచన వచ్చింది. "ఉండు, పూలు తెచ్చి పూజ చేస్తాను."

సువర్ణగన్నేరు చెట్టు దగ్గిరికి పోయి పూలు కోశాడు. పారిజాతాలు ఏరాడు. గులాబీలు కోశాడు. ఆయన పాదాలమీద చల్లాడు. కాని పారిజాతాలు ఏరేటప్పుడు వాడి పాదాల కింద మెత్తగా తగిలిందేమిటో వాడికి తెలియదు. అసలు వాడికి అవి కోస్తున్నాననే ధ్యాసే లేదు. యాంత్రికంగా చేశాడు. అంతే! ఆవేదనతో వాడి మనస్సు నిండిపోయింది. ఈ చీకట్లో, ఒంటరితనంలో ఆ దేవుడు తోడున్నాడనే భావమే లేకపోతే ఏనాడో పారిపోయేవాడు.

"పూజ చేశానుగా, ఇంక రావా? పలకవా? కృష్ణా!"

బయట ప్రకృతి స్తంభించింది. రాత్రితో ఏదో సృష్టిరహస్యం చెబుతున్నాయి నక్షత్రాలు.

ఈ హేమంతశర్వరి ఊపిరి బిగబట్టి వడుస్తున్నది. భూమి ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని చూస్తున్నది.



నీడా జాడా          ఫోటో — జి. సూర్యనారాయణ (భిలాయినగర్-1)

గాలిలోంచి ఎవరో పిలుస్తున్నట్లు పిలుపులు.

ఆయన ముందు దీపారాధన వింతగా చిందు లేస్తున్నది.

ఆకాశంలో నక్షత్రాలు కంపించిపోతున్నాయి.

పక్క చెరువులో నీళ్ళు దిగులుగా ఒడ్డుకు చేరి వెక్కి ఏడుస్తున్నాయి.

ఇంకా కృష్ణుడు పలకలేదు. పలకడు. ఆయనకేం? చెప్ప పెట్టేవాళ్ళున్నారు. ప్రేమగా, ఆర్తిగా పిలిచేవాళ్ళున్నారు.

"ఉండు, మురళి వాయిస్తాను." మురళి తీశాడు.

మురళీరవం ప్రకృతిలో కలిసి 'పురుషుణ్ణి' నిద్ర లేపటానికి ఉపక్రమించింది.

ఆ రవంలోంచి పురుషసూక్తం ధ్వనిస్తున్నదేమో!

అది రాగం కాదు. లయ కాదు. కేవలం ఒక శబ్దం మాత్రమే. కాని దాని వెనక ఆర్తి ఉంది. తపస్సు ఉంది. అన్వేషణ ఉంది. నిరీక్షణ ఉంది. ఆత్మనివేదన ఉంది.

ఇక దేవుడు ఎందుకు పలకడు?

"పలకవా? పలికేదాకా వాయిస్తాను."

మొండిగా ఊదటం మొదలుపెట్టాడు. కాని కొద్ది సేపటిలోనే రొప్పు వచ్చింది. ఆయాసం కలిగింది.

"నీలో దయ, జాలి ఏవీ లేవు. నువ్వు దొంగవి."

జవాబు లేదు.

వాడు దీనంగా రెండడుగులు ముందుకు వేశాడు.

"పోనీ, నన్నే మా అమ్మ దగ్గిరికి తీసుకువెళ్ళు."

ఆయనలో కదలిక ప్రారంభమైంది.

మళ్ళీ మురళీరవం అనంత ప్రకృతిలో కలిసింది.

ఒక దివ్యానుభూతి. ఒక సమాధిలాంటి స్థితి.

వాడి అంతరంగంలో మరో కొత్త లోకం దేదీప్యమానంగా ప్రకాశిస్తూ తెరుచుకుంది. వాడి కళ్ళు అర్ధనిమీలితములైనాయి. వాడి ఆత్మకి కృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ సమీపిస్తున్నాడు.

ఆ మురళీరవం "కృష్ణా, ఆపద్బాంధవా" అని ఆక్రోశిస్తున్నది.

వాడి అహం ఆ రవంలో లీనమైపోయింది. కృష్ణుడు లీలామానుష విగ్రహుడు. దగ్గిరగా వచ్చాడు.

ఒక స్పర్శ. దేహమంతా కదిలింది. వాడి దేహం అమృతమయమైంది. వాడి గుండె బరువెక్కుతున్నది.

భూదేవి తల్లిలా వాణ్ణి ఒడిలోకి తీసుకుంది.

కృష్ణుడు నవ్వుతూ వాడి చేయి పట్టుకున్నాడు.

"నిజంగా నువ్వు దయగలవాడివి. మా అమ్మని చూపించు."

పారిజాతం జాలిగా పూలు రాల్చింది.

కృష్ణసర్పం జరజరా పాకిపోయింది.

ఆనందానుభూతితో వాడి ఆత్మ అస్తిత్వాన్ననుభవించింది.

వాణ్ణి ఎవరో ఎత్తుకున్నారు. వాడి కళ్ళకి ఈ స్థూలప్రపంచం సూక్ష్మాతిసూక్ష్మమై పోతున్నది. వాడిలో చైతన్యం నిలువస్తమై పోతున్నది. వాడి కళ్ళకి మిలమిలా మెరుస్తున్న తారకాహార పంక్తులు దగ్గిరగా వచ్చి కనపడినాయి.

ఏ తల్లి కోసరమై ఈ రాత్రిలో ఇంత ఆవేదన పొందాడో ఆమె పవిత్రమైన దివ్యత్వాన్ని వహించి వాడి కోసరం చేతులు చాచింది. ఆమె వేయిజ్యోతుల కాంతితో నవ్వుతూ పిలిచింది.

"అమ్మా!"

"అ—మ్మా!"

"అ. . .మ్మా. . . అ. . ."

వాడి నోటిలోంచి నురుగు వచ్చింది. ఒక్క దూకుతో తల్లి దగ్గిరికి పరిగెత్తాడు. కాని . . .

వెలగపండులోని గుజ్జును తీసుకుని ఆ పెంకుని వదిలినట్లు, వాడి భౌతికశరీరం అక్కడే పడి ఉంది. ★